# నాకే టికెట్



➢ సిట్టింగ్‌లకు కలవరం రేపుతున్న ఆశావహుల ప్రయత్నాలు
➢ ఎవరికి టిక్కెట్లు దక్కుతాయో అయోమయం
➢ అసెంబ్లీ పోరుకు గులాబీ సమాయత్తం

రానున్న సాధారణ ఎన్నికల్లో మళ్లీ అధికారం చేజిక్కించుకోవా లనే లక్ష్యంతో అధికార పార్టీ తమ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేసుకుంటోంది. మరో మూడు నాలుగు నెలల గడువు ఉన్నా.. అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుంటోంది. శాసనసభ ఎన్నికల ఏర్పాట్లపై ప్రభుత్వం పరోక్షంగా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వ డంతో గులాబి పార్టీలో హడావుడి మొదలైంది. ఈ ఏడాది చివర్లో ఎన్నికలు ఉంటాయని ఇప్పటికే నేతలకు పరోక్షంగా సంకేతాలు అందాయి.



హైదరాబాద్, జూలై 30 ప్రభాతవార్త : నగరంలోని శాసనసభ నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకు ఆశావాహులు గంపెడంత ఆశతో కదులుతున్నారు. అయితే బిఆర్ఎస్ నుంచి ఆశావహుల జాబితా చాంతాండంత అయ్యేలా కనిపిస్తోంది. నోటిఫికేషన్ వెలువడేనాటికి ఎవరికి టిక్కెట్లు దక్కుతాయో తెలియని అయోమయం నెలకొంది. గ్రేటర్ పరిధిలోని చాలా నియోజకవర్గా ల్లో సిట్టింగ్ ల్లో ఆశావహుల ప్రయ త్నాలు కలవ రం రేపుతున్నాయి. పార్టీ అగ్రనాయకులు, మంత్రులు, అధిష్టానంతో ఉన్న సంబంధాలకు మరింత పదును పెట్టేందుకు సిద్ధపడుతున్నారు. ఎంతో కాలంగా అసెంబ్లీ సీట్లపై కన్నేసిన బిఆర్ ఎస్ పార్టీలోని ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వీరిలో సిట్టింగ్ కార్పొరే టర్లతో పాటు మాజీ ఎమ్మెల్యేలు సైతం ఉన్నారు. సిట్టింగ్‌లకే టికెట్లని పార్టీ అధ్యక్షుడు ప్రకటించినా.. నోటిఫికేషన్ వెలువడే నాటికి ఎవరికి టిక్కెట్లు దక్కుతామో తెలియని అయోమయం నెలకొంది. గ్రేటర్ పరి ధిలోని చాలా నియోజవకర్గాల్లో సిట్టింగ్‌ల్లో ఆశావహుల ప్రయత్నాలు కలవరం రేపుతున్నాయి.

అంబర్‌పేట నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పార్టీ టికెట్‌పై ధీమాగా ఉన్నా ఇక్కడ బలమైన అసమ్మతి గ్రూపులున్నాయి. గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య భర్త, పార్టీ సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు ఎడ్ల సుధాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతి డిపిరెడ్డిలు ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. ముషీరాబాద్‌లో ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తోపాటు మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అల్లుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెన్ శ్రీనివాస్ రావులు టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. కంటోన్మెంట్‌లో ఎమ్మెల్యే సాయన్న మరణంతో ఆ సీటుపై ఆయన కుమార్తె మాజీ కార్పొరేటర్ లాస్య నందిత గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ఇక్కడ నుంచి ఎర్రోళ్ల శ్రీనివాస్, మన్నె క్రిశాంక్, గజ్జల నగేష్‌లు ఈ నియోజకవర్గం నుంచి తమకే టికెట్ వస్తుందని ఎవరికివారు తమ సన్నిహితుల ముందు చెబుతున్నారు. జూబ్లీ హిల్స్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ తనకెవరూ పోటీలేరను కుంటుండగా మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, బిజెపి నుంచి బిఆర్ఎస్‌లో చేరిన రావుల శ్రీధర్‌రెడ్డిలు కూడా ఈ సీటును ఆశిస్తున్నారు. ఖైరతాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న దానం నాగేందర్‌తో పాటు మన్నె గోవర్ధన్‌రెడ్డి, తిరిగి ఇటీవల పార్టీలో చేరిన దాసోజు శ్రవణ్ ఈ నియోజకవర్గం నుంచి టిక్కెట్ ఆశిస్తున్నారు. సికింద్రాబాద్‌లో డిప్యూటీ స్పీకర్ టి.పద్మా రావుగౌడ్‌కు ఎదురులేదని అనుకుం టున్నా.. ఇక్కడి నుంచి ఈసారైనా తనకు అవకాశం కల్పించాలని తెలంగాణ ఉద్య మకారుడు, బిఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ నాయకుడు మోతె శోభన్‌రెడ్డి కోరుతు న్నాడు. ఇక మల్కాజిగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మరోసారి పోటీచేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే రాజకీయ సమీకరణలు మారితే ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్‌ను అసెంబ్లీ బరిలో దింపి, అన్ని రంగాల్లో బలమైన నేతగా గుర్తింపు పొందిన హనుమంత రావును మల్కాజ్‌గిరి లోక్‌సభ నుంచి పోటీకిదింపే అవకాశాలు లేకపోలేదని పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆరెకపుడి గాంధీతోపాటు కార్పొరేటర్లు జగదీశ్వర్‌గౌడ్, రాగం నాగేందర్, పార్టీ సీనియర్ నాయకుడు బండి రమేష్ ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కూకట్‌పల్లిలో మాధవరం కృష్ణారావు తిరిగి తనకే టికెట్ వస్తుందని భావిస్తుండగా, ఎమ్మెల్సీ నవీన్‌రావు అసెం బ్లీపై కన్నేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం టికెట్ తిరిగి తనకే దక్కుతుందని సిట్టింగ్ ఎమ్మెల్యే డి.సుధీర్‌రెడ్డి ధీమాగా ఉన్నా గతంలో ఇక్కడ బిఆర్ఎస్ నుంచి పోటీచేసి ఓటమి పాలైన రామ్మోహన్‌గౌడ్ కూడా ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఉప్పల్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తిరిగి తనకే టికెట్ అంటున్నారు. సికింద్రాబాద్‌లో తనకు టికెట్ ఇవ్వనిపక్షంలో ఉప్పల్ నుండి అవకాశం కల్పించాలని మోతె శోభన్ రెడ్డి కోరుతున్నారు. అయనతోపాటు బండారి లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌లు ఈ సీటుపై ఆశలు పెట్టుకున్నారు. రాజేంద్రనగర్‌లో పోటీచేసేందుకు సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో పాటు ఎంపి రంజిత్‌రెడ్డి ఈసారి అసెంబ్లీ నుంచి పోటీచేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కుత్బుల్లాపూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్‌తో పాటు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సైతం ప్రయ త్నాలు చేస్తున్నారు. గులాబీ పార్టీ 'ఓవర్ లోడ్'తో సతమ తమవుతున్న నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో ఎవరికి టికెట్లు దక్కుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయని పరిశీలకులు పేర్కొంటున్నారు.

## 9, 10 తేదీలలో మహా ధర్నాలు విజయవంతం చేయాలి: ఏఐటియుసి పిలుపు




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.బాల్‌రాజ్. చిత్రంలో నర్సింహ్మా, యూసఫ్, చంద్రయ్య, రత్నాకర్‌రావు ఉన్నారు

సైఫాబాద్, జులై 30 ప్రభాతవార్త: కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ, ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 'క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూరి'తో ఆగస్టు 9, 10 తేదీలలో జరిగే మహా ధర్నాలను జయప్రదం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర సమితి పిలుపునిచ్చింది. ఆదివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఏఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ అనేక త్యాగాలు రక్తతర్పణలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చుతూ కేంద్ర ప్రభుత్వం చట్టం చేసిందని ఆరోపించారు. దీంతో పోరాడి సాధించుకున్న చట్టాలు కార్పొరేట్ పెట్టుబడిదారుల చేతుల్లోకి పెట్టిందన్నారు. కాంట్రాక్ట్ కార్మిక విధానం అన్ని రంగాల్లో మరింత పెంచుతూ దోపిడికి హద్దులేకుండా పోతున్నదని, 40 కోట్లమంది అసంఘటిత రంగ కార్మికులు ఈ లేబర్ కోడ్‌లతో బానిసత్వంలోనికి నెట్టబడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాల్లో ఒక కోటి మంది స్కీం వర్కర్లు ఉద్యోగ భద్రత, కనీస వేతనానికి నోచుకునే పరిస్థితి ఏర్పడిందని, రాష్ట్రంలో కనీస వేతనాలు అమలు పరచకపోవడం జరుగుతున్నదని వీటన్నింటికి వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, ఉపాధ్యక్షులు బి.చంద్రయ్య, పి.ప్రేమ్‌పావని, సీనియర్ నాయకుడు ఉజ్జిని రత్నాకర్‌రావు, నాయకులు ఏసురత్నం, పల్లా దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉజ్జయినీ మహాకాళీ హారతికి తరలి వచ్చిన భక్తులు



బేగంపేట జులై 30,ప్రభాతవార్త : సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయానికి భక్తులు పోటెత్తుతూనే ఉన్నారు. ఆషాడ బోనాల జాతర ముగిసినప్పటికీ ఆలయానికి (మంగళ,శుక్ర, ఆదివారాల్లో) వచ్చే భక్తుల తాకిడి మాత్రం తగ్గడం లేదు. శుక్రవారం రోజున అమ్మ వారికి మొదటి వారం సాక వెయ్యిమంది మహిళా భక్తులు సమర్పించారు. అయితే ఆదివారం కూడా పెద్ద ఎత్తున అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అమ్మ హారతి తీసుకునే సమయంలో ఆలయం మొత్తం భక్తులతో నిండిపో యింది. ప్రతి మంగళ,శుక్ర,ఆదివారాల్లో అమ్మ వారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తుంటారు. అమ్మ వారి ఆలయం ఉండే ప్రాంతం మొత్తం వివిధ రకాలైన వ్యాపారాలు నిర్వహించుకునే ప్రాంతం కావడంతో ఆలయానికి భక్తుల రద్దీ ఎప్పుడూ కొనసాగుతూనే ఉంటుంది. ఆదివారం ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మ వారి దర్శనం చేసుకోవడంతో పాటు ప్రత్యేకంగా హారతి కోసం వేచి ఉండటంతో ఆలయం భక్తుల రద్దీతో నిండిపోయింది. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో జాగ్రత్త చర్యలు చేపట్టారు.



మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించి తమ గోడును చెప్పుకున్న ఉపాధ్యాయినీలు

## స్పౌజ్ బదిలీలను వెంటనే చేపట్టాలి

**విద్యా శాఖ మంత్రికి మొరపెట్టుకున్న ఉపాధ్యాయినీలు**

సైఫాబాద్, జులై 30 ప్రభాతవార్త: ఎస్‌జిటి, పిఇటి, భాషా పండితులు, మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్స్, మిస్సింగ్ సౌజ్‌ల బదిలిలను చేపట్టాలని మహిళా ఉపాధ్యాయినీలు ఆదివారం నాడిక్కడ రాష్ట్ర విద్యా శాఖ మం త్రి సబితాఇంద్రారెడ్డిని వేడుకున్నారు. ఈ సందర్భంగా వారు మంత్రికి వినతి పత్రాన్ని సమర్పించి మాట్లాడారు. గత జనవరి మాసంలో ప్రభుత్వం కేవలం 615 మంది స్కూల్ అసిస్టెంట్ స్పౌజ్ బదిలీలు మాత్రమే చేపట్టిందని ఇంకా మిగిలిన 1500 మంది ఎస్‌జిటి, భాషా పండితులు, పిఇటిల స్పౌజ్ బదిలీల విషయాన్ని సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైన త్వరగా తమకు న్యాయం చేయాలని ఉపాధ్యాయినీలు మంత్రిని వేడుకున్నారు. ఇందులో మేజారిటి బాధితులు మహిళా ఉపాధ్యాయినీలే ఉన్నారని, ప్రతి రోజు కుటుంబాని వదిలిపెట్టి వందల కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ తీవ్ర శారీరంక, మానసిక ఆందోళనలకు గురవుతున్నారని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి ఈ సమస్యలను సిఎం దృష్టికి తీసుకువెళతా మన్నారు. అనంతరం వారు ఎంఐఎం అధినేత అసదుద్ధీన్ ఓవైసికి తమగోడును వెళ్ళబోసుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఎలక్ట్రిషియన్ మృతి

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 30 ప్రభాతవార్త : రోడ్డు ప్రమాదంలో ఓ ఎలక్ట్రిషియన్ మృతి చెందిన సంఘటన ఆదివారం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం....బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రాంతానికి చెందిన రవి కాంత్ (35) ఉస్మానియా ఆసుపత్రిలో ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రవి కాంత్ ద్విచక్ర వాహనంపై బుద్వేల్ ప్రాంతం నుంచి ఆరాంఘర్ చౌరస్తా మీదుగా ప్రయాణం చేస్తునా న్నడు. అదే సమయంలో వెనుక నుంచి అతి వేంగా వచ్చిన కారు రవి కాంత్ వాహనాన్ని ఢీ కొట్టింది. తీవ్ర గాయాల పాలైన రవి కాంత్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రవికాంత్‌కు భార్య, ఒకటిన్నర సంవత్సరాల వయస్సు గల బాబు కలరు. కాగా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రవి కాంత్ మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. ప్ర ప్రమాదానికి కారకుడైన కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



హైదరాబాద్ వార్త

# అధికారుల ప్రోత్సాహంతోనే కబ్జా?

**మట్టి, బండరాళ్లతో చెరువును పూడ్చిన కబ్జాదారులు ▲ గౌలిదొడ్డి వాసులపై కేసులు నమోదు**




ఈద్గోనికుంటలో మట్టిని నింపి చదును చేసిన కబ్జాదారులు | కబ్జాదారులకు జరిమానా విధిస్తూ నోటీసులు అంటించిన ఇరిగేషన్ అధికారులు | నెలరోజుల క్రితం ఈద్గోనికుంట(ఫైల్‌ఫోటో)

శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపన్‌పల్లి ఈద్గోనికుంటపై ఆక్రమణదారులు పాగావేశారు. ఐటి కారిడార్‌కు ఆనుకొని గౌలిదొడ్డి ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈద్గోనికుంటలో భారీ ఎత్తున మట్టి, బండరాళ్లను నింపి చదును చేశారు. ఓ వైపు ఇరిగేషన్ అధికారులు చెరువు సుందరీకరణ కోసం పనులు చేపట్టగా, కబ్జాదారులు చెరువును మొత్తం కభళించారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా కబ్జాదారులు ఐదెకరాల చెరువును మొత్తం చదును చేసిన తరువాత ఇరిగేషన్ అధికారులు స్పందించి కబ్జాదారుల మీద గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు చెరువును దూడ్చిన గౌలిదొడ్డికి చెందిన ఇద్దరు బడా వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. దీంతో పాటు చెరువును పూడ్చిన కబ్జాదారులకు ఇరిగేషన్ శాఖ 1.84కోట్ల రూపాయల జరిమానా విధిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం తతంగంలో ప్రభుత్వ భూములు చెరువులను కాపాడాల్సిన శేరిలింగంపల్లి రెవెన్యూ యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుండగా, కొందరు శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారుల ప్రోత్సాహంతోనే ఈద్గోనికుంట కబ్జాకు గురయ్యిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**కబ్జాదారులకు రూ.1.84కోట్ల జరిమానా విధిస్తూ ఇరిగేషన్ శాఖ నోటీసులు**

**ఈద్గోనికుంట చెరువు ఇక గత జ్ఞాపకమేనా**

గచ్చిబౌలి, జూలై 30 ప్రభాతవార్త : శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి సర్వేనెంబర్ 71లోని ఈద్గోని కుంట చెరువు 5.3 ఎకరాల్లో విస్తరించివుండేది. ఐటి కారిడార్‌కు ఆనుకొని గౌలిదొడ్డి ప్రధాన రహదారి కూతవేటు దూరంలో ఉన్న ఈ చెరువు నాడు పంట పొలాలకు సాగునీరందించగా, నేడు స్థానికంగా భూగర్భ జలాల పరిరక్షణకు ఉపయోగపడుతుంది. ఈచెరువుకు ఆనుకొని ఓ బడా నిర్మాణ సంస్థ భారీ బహుళ అంతస్థుల నిర్మాణం చేపట్టడం చెరువు సమాధికి దారితీసింది. ఎన్నో ఏళ్లుగా చెరువు మీద కన్నేసిన గౌలిదొడ్డికి చెందిన కొంతమంది కబ్జాదారులు బడా నిర్మాణ సంస్థతో కలిసి చెరువు కబ్జాకు పథకం వేశారు. ఇందులో భాగంగా చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో తమ పట్టా భూమి ఉందని కోర్టుకు విన్నవించి, నీళ్ల లేని సమయంలో సాగు చేసుకునే విధంగా కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. మరోవైపు చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా ఇరిగేషన్ శాఖ ఈ చెరువును ఆధునీకరించేందుకు పనులు చేపట్టింది. చెరువు చుట్టు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో పాటు చెరువు కట్ట మరమ్మతు పనులను శ్రీకారం చుట్టింది. కాగా గోపన్‌పల్లి సర్వే నెంబరు 71/1, 71/2లో మొత్తం 2.23గుంటల స్థలం తమ పట్టా భూమి అని కోర్టును గౌలిదొడ్డికి చెందిన రాజు, ప్రకాశ్‌లు కోర్టును ఆశ్రయించగా, ఎఫ్‌టిఎల్ పరిధిలో సదరు భూమి ఉన్న కారణంగా చెరువులో నీళ్ల లేని సమయంలో సాగు చేసుకోవాలంటూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను ఆసరాగా చేసుకున్న కబ్జాదారులు ఏకంగా చెరువునే కనుమరుగు చేసే పథకం వేశారు. బడా నిర్మాణ సంస్థతో కలిసి భారీ ఎత్తున మట్టి, బండరాళ్లను చెరువులో నింపి చదును చేశారు. నిర్మాణ సంస్థ లేఅవుట్ నుంచే ప్రహరీ గోడను ధ్వంసం చేసి రాత్రి వేళల్లో యదేచ్ఛగా చెరువులో వేలకొద్ది టిప్పర్లతో మట్టిని నింపి చెరువును పూడ్చివేశారు. వర్షాకాలంలో నిండనీటితో కళకళలాడే చెరువు నేడు చదును చేసిన మట్టితో క్రికెట్ గ్రౌండ్‌ను తలపిస్తుంది.

**కబ్జాదారులపై కేసు నమోదు**

**రూ. 1.84కోట్ల జరిమానా**

ఈద్గోనికుంట చెరువును కబ్జా చేయడంతో పాటు సుందరీకరణ పనులను ధ్వంసం చేయడం, కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన గౌలిదొడ్డికి చెందిన రాజు, ప్రకాశ్‌ల మీద చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఎఈ జ్యోతిర్మయి ఈనెల 5వ తేదీన గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన గచ్చిబౌలి పోలీసులు రాజు, ప్రకాశ్‌లను నిందితులుగా చేర్చుతూ కేసు నమోదు చేయడంతో పాటు నోటీసులను జారీ చేశారు. కాగా కేసు నమోదు చేసి మిన్నకుండడంతో కబ్జాదారులు చెరువు పూడ్చివేత పనులను పరిపూర్ణం చేశారు. కేసు నమోదైన తరువాత సైతం భారీ ఎత్తున మట్టి, బండరాళ్లను చెరువులో డంపింగ్ చేసి చదును చేశారు. విషయం తెలుసుకొని ఇరిగేషన్ అధికారులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా, వారిని సైతం బెదిరింపులకు గురి చేశారనే ఆరోపణలు ఉన్నాయి. శేరిలింగంపల్లి మండల రెవెన్యూ కార్యాలయానికి చెందిన కొందరు అధికారుల ప్రోద్భలంతోనే కబ్జాదారులు ఈద్గోని కుంటను యదేచ్ఛగా పూడ్చివేశారని స్థానికులు వాపోతున్నారు. కబ్జాదారులు చెరు వు పూడ్చివేత పనులను నిలిపివేయకపోవడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు, పోలీసులు, జిహెచ్ ఎంసీ అధికారులతో కలిసి తాజాగా ఉమ్మడి పరి శీలన చేపట్టారు. చెరువును పూడ్చిన గౌలిదొడ్డికి చెందిన రాజు, ప్రకాశ్‌లకు చెరువు ధ్వసం కింద 1.10కోట్లు, పూడ్చిన మట్టి తొలగింపు కోసం 74లక్షల చొప్పున మొత్తం 1.84కోట్ల జరిమానా విధిస్తూ నిందితులకు నోటీసులు జారీ చేశారు. కేసులు, జరిమానాలతో సరిపెట్టకుండా చెరువులో నింపిన మట్టిని తొలగించి, తటాకాన్ని పూర్వ స్థితికి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# నెత్తురోడిన నగర రోడ్లు

**వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం**



అదుపుతప్పి పుట్‌పాత్ ఎక్కి హుస్సేన్‌సాగర్‌లోకి దూసుకెళ్లేలా కనిపిస్తున్న బీభత్సం సృష్టించిన కారు




అరంఘర్‌లో ప్రమాదానికి గురైన కారు

హైదరాబాద్, జూలై 30 ప్రభాతవార్త : హైదరాబాద్‌లో ఆదివారం విషాదం చోటు చేసుకుంది. ఒకేసారి పలు చోట్ల ప్రమాదాలు జరిగాయి. కేవలం గంటల వ్యవధిలోనే ఈ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఉదయం పూట కేవలం మూడు గంటల వ్యవధిలోనే మూడు రోడ్డు ప్రమాదాలు జరగడం కలకలం రేపింది. ఈ మూడు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఎన్టీఆర్ మార్గ్‌లో ఆదివారం తెల్లవారుజామున కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా ఉన్న కారు అదుపుతప్పి హుస్సేన్ సాగర్‌లో పడిపోయే ప్రమాదం నుంచి తప్పించుకుంది. అయితే కారులో ఉన్న సెఫ్టీ బెలూన్స్ తెరుచుకోవడం వల్లే అందులో ఉన్న ఇద్దరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆ తర్వాత వారు కారు దిగి వెళ్లిపోయారు. ఈఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. కారు అతివేగంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు అంచనా వేస్తున్నారు. రాజేంద్రనగర్‌లోని అరాంఘర్ చౌరస్తాలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ కారు, బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాయి ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డారు. కారులో ఎయిర్ బెలూన్ తెరుచుకోవడంతో అతడికి ప్రమాదం తప్పింది. అలాగే కుషాయిగూడలోని ఓ ప్రమాదంలో డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కూడా ఇద్దరు మరణించారు. అయితే ఈ ప్రమాదాలు వాహనాలు వేగంగా నడపడమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. అయితే స్పాట్‌లోనే వారందరు చనిపోయారు. అంతేకాదు వారంతా కూడా మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఈ మూడు రోడ్డు ప్రమాదాలపై సంబంధిత పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేశారు. ప్రమాదానికి గత కారణాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో హైదరాబాద్‌లో ప్రమాదాలు ఎక్కు వగా జరుగుతున్నాయి. ట్రాఫిక్ ఎక్కువ అవ్వడం వల్ల అధిక వేగంగా వాహనాలను నడపడం, మద్యం సేవించడం వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరిగినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదాల నివారణకు పోలీసులు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న ప్రమాదాలు మాత్రం ఆగడం లేదు.

**బైక్ ఢీకొట్టి ఇద్దరు మహిళలు మృతి**

బొల్లారంలో రోడ్డు ప్రమాదం జరిగింది. వాకింగ్‌కోసం పార్కుకు వెళ్తుండగా బైక్ ఢీకొట్టి ఇద్దరు మహిళలు మృతిచెందారు. బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిదిలో తెల్లవారుజామున 5గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిత్య అనే ఐటీ ఉద్యోగి ద్విచక్రవాహనంపై బొల్లారం నుంచి శామీర్‌పేట్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆటుగా రోడ్డు దాటుతున్న రాధిక, బాలమ్మలను అతడు బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు..కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అతివేగంగా డ్రైవ్ చేయడమే ప్రమాదానికి కారణమని చెప్పారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు.

**రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి**

**కుషాయిగూడ..** సర్కిల్ డివైడర్‌ను ఢీకొని ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం పాలైన విషాదకరమైన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్వస్థలం వరంగల్ జిల్లా జనగామకు చెందిన వెంకటేష్ కుమారుడు రామంతపూర్‌లో నివాసం ఉంటున్నారు. మౌలాలి నవోదయనగర్‌కు చెందిన హనుమంతు కుమారుడు క్రాంతి (23) కొంపల్లి మల్లారెడ్డి కళాశాలలో బిబిఏ చదువుతున్నాడు. మౌలాలి ప్రాంతానికి చెందిన క్రాంతి బంధువు, స్నేహితుడైన నరేష్ 23 ఈసీఐఎల్‌లోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఈనెల 30 తేదీ ఆదివారం తెల్లవారుజామున ఉదయం 4:40 గంటల ప్రాంతంలో టిఫిన్ చేయడం కోసం మౌలాలి నవోదయనగర్ నుండి ఈసీఐఎల్‌కు మోటారు బైకుపై బయలుదేరి వస్తుండగా ఇసిఐఎల్ చౌరస్తాలో గల సర్కిల్‌ను అతివేగంగా ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. హృదయ విదారకమైన విషాద సంఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.





ఆదివారం రవీంద్రభారతిలో జరిగిన మహతి మ్యూజిక్ అకాడమీ అధ్వర్యంలో ప్రదర్శించిన రవీంద్రనాథ్ కథానికం చందాలిక నృత్యరూపకం

## ఘనంగా బోనాల ఉత్సవాలు : ఎమ్మెల్యే



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ జలందర్ తదితరులు

**వనస్థలిపురం, జూలై 30 ప్రభాతవార్త :** బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీలో జరిగిన బోనాల వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విచ్చేసారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటినేతలు వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఈ ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో డివిజన్ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాక్షించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ జలందర్, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు. అదే విధంగా శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ కమిటీ ఆహ్వానం మేరకు డివిజన్ మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న రామ్మోహన్‌గౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గంగం ప్రేమ్‌నాథ్, కాలనీ అధ్యక్షుడు బాలాజీ, ముద్ద గౌని చంద్రకాంత్‌గౌడ్, తిరుమలేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు: మంత్రి సబితా ఇంద్రారెడ్డి



మంత్రి సబితా ఇంద్రారెడ్డికి పుస్తకాన్ని అందజేస్తున్న దృశ్యం

**ఎల్.బి.నగర్, జులై 30 ప్రభాతవార్త :** సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బోనాల పండగ అని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆర్కేపురం డివిజన్‌లోని ఖిల్లామైసమ్మ దేవాలయంలో బోనాల పండగ ఉత్సవ కార్యక్రమానికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం నిర్వాహకులు ఈ సందర్బంగా ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్బంగా దేవాలయసిబ్బంది మంత్రికి దేవాలయ విశిష్టత తెలిపే పుస్తకమును అందజేశారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా దేవాలయాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. ఖిల్లా మైసమ్మ దేవాలయ అభివృద్ధికి కోటి రూపాయల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, షాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నెంటూరి రవీందర్ రెడ్డి, రామ్ నర్సింహగౌడ్, గొడుగు శ్రీనివాస్, న్యాల కొండ శ్రీనివాస్ రెడ్డి, రామాచారి ముప్పిడి లింగస్వామిగౌడ్, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, వెంకటేష్‌గౌడ్, పెంబర్తి శ్రీనివాస్, ఎస్కే మహమ్మద్, రమేష్, పటేల్ సునీత రెడ్డి, ఊర్మిలరెడ్డి, పుష్పలతరెడ్డి, స్వప్నరెడ్డి, అనురాధ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించండి : నంబూరి కృష్ణంరాజు

**కుషాయిగూడ, జూలై 30 ప్రభాతవార్త :** మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రముఖ పర్యావరణ పరిరక్షకులు లక్షల మొక్కల దాత నంబూరి కృష్ణంరాజు పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా డివిజన్ ఈశ్వరపురి కాలనీలో ఆయన ఉసిరి మారేడు నేరేడు పనస మొక్కలను అనేకమందికి ఉచితంగా పంపిణీ చేశారు.

## మణిపూర్ అల్లర్లకు నిరసనగా ఉప్పల్‌లో క్రైస్తవ సంఘాల శాంతి ర్యాలీ

**ఉప్పల్, జూలై 30 ప్రభాతవార్త :** మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లు, మారణకాండ మందిర ధ్వంసంలను నిరసిస్తూ క్రైస్తవ సంఘాలు, పాస్టర్లు, మేధావులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఉప్పల్‌లో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా జరిగిన కార్యక్రమంలో పాస్టర్ జి.సురేష్‌బాబు, పాస్టర్ కెఎస్ ప్రకాష్‌రావు, జేరుసేలం మత్తయ్య తదితరులు మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులకు పాల్పడుతున్నారని, వీటిని నిలువరించేందుకు కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్, చిలుకానగర్ మండల చర్చి పాస్టర్లు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి: వక్కలంక



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

**ఎల్.బి.నగర్, జూలై 30 ప్రభాతవార్త :** ఉచిత వైద్య శిబిరాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు పేర్కొన్నారు. సరూర్ నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సెంటర్ ఫర్ సైట్ వైద్యులు కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత కంటి వైద్య పరీక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 77 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అందులో 20 మందికి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసిన వారిని సెంటర్ ఫర్ సైట్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా అపరేషన్ చేయించి అవసరమైన మందులు, కంటి అద్దాలను అందజేస్తామని కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంప్‌ఇంచార్జి సత్యనారాయణ, డాక్టర్ పి. విజయశ్రీ, వాణి, నాగేంద్ర, డాక్టర్స్ కాలనీ అసోసియేషన్ సబ్యులు, మహిళా మండలి అసోసియేషన్ సభ్యులు, వైస్‌ప్రెసిడెంట్ జనార్ధన్‌రెడ్డి, కోశాధికారి ఉమామహేశ్వరరావు, కార్యవర్గ సబ్యులు నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి : చౌకి రవికుమార్

**మలక్‌పేట, జూలై 30 ప్రభాతవార్త :** ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని ఉత్సవ కమిటీ చైర్మన్ రవికుమార్ పేర్కొన్నారు. మలక్‌పేట పంచశీల గ్రంథాలయంవద్ద ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బోనాల ఉత్సవాల అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన ఫలహార బండి నిర్వాహకుడు సిందం చందును రవికుమార్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల ఉత్సవాలు తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్‌కుమార్, ముప్పిడి శ్రీనివాస్, నరేందర్‌ముదిరాజ్, చౌకి రాజు, రేవంత్, రాజేష్ పటేల్, బాలకృష్ణయాదవ్, శ్రీధర్, టిన్నుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీల విషయంలో గొడవ పడిన పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలపై కేసు

**ఉప్పల్, జూలై 30 ప్రభాతవార్త :** పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఫ్లెక్సీల విషయంలో గొడవ పడిన పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలపై ఉప్పల్ పోలీసులు ఎస్సీ ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేశారు. సిఐ గోవిందరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్‌లో ఎలివేటెడ్ కారిడార్ పనులను పరిశీలించేందుకు పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి శనివారం ఉప్పల్ పర్యటనకు వచ్చారు. ఇదే క్రమంలో రాగిడి లక్ష్మారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి వర్గీయులు ఫ్లెక్సీల విషయంలో గొడవ జరిగిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో తనను కులం పేరుతో దూషించారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ కె.నరేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నేతలు మంద మురళీకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రామ కృష్ణ, రఘునాద్‌రెడ్డి, బంటి, నరేష్ ముదిరాజ్, శ్రీకాంత్‌యాదవ్ తదితరులపై పోలీసులు ఎస్సీ ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇదే విషయంపై మరో రెండు ఫిర్యాదులు ఉన్నాయని, వాటిపై కూడా చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని సిఐ గోవిందరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కూరగాయల మార్కెట్‌కు ఫ్రిడ్జ్ వితరణ : బిఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి



కూరగాయల మార్కెట్‌కు ఫ్రిడ్జ్‌ను అందిస్తున్న బండారి లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ, జూలై 30 ప్రభాతవార్త :** పేద మధ్యతరగతి ప్రజలను ఆదుకోవడానికి తమ ఎప్పుడు సిద్ధంగా ఉంటామని బిఎల్ ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్, బిఆర్ఎస్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని కుషాయిగూడ కూరగాయల మార్కెట్‌కు నీటి ఫ్రిడ్జ్‌ను అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ జేరిపోతుల ప్రబుదాస్, నాయకులు జనంపల్లి వెంకటేశ్వరరెడ్డి, గుమ్మడి జంపాల్‌రెడ్డి, కాసం మహిపాల్‌రెడ్డి, మురళీ పంతులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : వి. కృష్ణమోహన్‌రావు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, చిత్రంలో విఠల్, కాటపల్లి వీరస్వామి, రాజేశ్వరరావు తదితరులు

**మలక్‌పేట, జూలై 30 ప్రభాతవార్త :** రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధిలోకి రావాలని బిసి కమిషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ వీరభద్రీయ (వీర ముష్టి) కేంద్ర సంఘం ఆధ్వర్యంలో మూసారాంబాగ్ కార్యాలయంలో నిర్వహించిన విద్య ప్రతిభ పురస్కారం-2023 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 10వ తరగతి, ఇంటర్, బిటెక్, ఎంబిబిఎస్ కోర్సులలో ప్రతిభను చాటుకున్న విద్యార్థులకు జ్ఞాపికలు, నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు, పేరు ప్రఖ్యాతలు వస్తాయన్నారు. విద్యా కమిటీ చైర్మన్ కె.విఠల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేంద్ర కమిటీ అధ్యక్షుడు కాటపల్లి వీరస్వామి, జాతీయ కమిటీ అధ్యక్షుడు కాటపల్లి రాజేశ్వరరావు, సమన్వయ కర్తలు కొండయ్య, పోచయ్య, నాగప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## 9వ వార్డులో ఘనంగా బోనాల పండుగ



9వవార్డులో బోనాల పండుగలో కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి

**హయత్‌నగర్, జూలై 30 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కేంద్రంతో పాటు సమీప కాలనీల్లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆయా వార్డులకు చెందిన మహిళలు సమీపంలోని అమ్మవారి ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించి బోనాలను సమర్పించారు. 9వ వార్డులోని సాయి కుటీర్, శ్రీనగర్‌కాలనీ, సూర్యవంశి కాలనీల్లో ఆలయాలవద్ద బోనాలకు కౌన్సిలర్ చల్లూరి మురళీధర్‌రెడ్డి హాజరై పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సదుపాయాలను కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా కాలనీల ప్రతినిధులు ఎన్నేపల్లి మధుసూదన్‌రెడ్డి, బిక్షమయ్య, సురేందర్‌రెడ్డి, నక్కల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మా భూములు మాకే పంచాలి : శ్రీనివాస్



దావూద్‌ఖాన్‌గూడలో దళితులతో కలిసి ఆందోళన చేస్తున్న గుడ్ల శ్రీనివాస్

**సరూర్‌నగర్, జూలై 30 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని దావూద్‌ఖాన్‌గూడ సర్వే నెంబర్ 2లో ఖాళీగా ఉన్న భూములు గతంలో తమ కుటుంబాలు సాగు చేసినవేనని వాటిని దళితులకేపంచాలని మహేశ్వరం నియోజకవర్గ బిఎస్‌పి అధ్యక్షుడు, గ్రామ దళిత నాయకుడు గుడ్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ దళిత కుటుంబాలకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా ఆదివారం ఆయన దావూద్‌ఖాన్‌గూడలో దళితులతో కలిసి బైఠాయించి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దావూద్‌ఖాన్‌గూడలో సుమారు 70 సంవత్సరాలుగా సాగు చేస్తున్న భూమిని ప్రభుత్వం ప్రజలం అవసరాల కోసం తీసుకుంటే తాము అభ్యంతరం ఏమీ చెప్పలేదనీ అయితే మిగిలిని 16 ఎకరాల భూమిని మాత్రం ఇష్టారాజ్యంగా చేస్తామంటే ఊరుకునేది లేదని ఆయన స ్పష్టం చేశారు. ఈ భూమిని గ్రామంలోని దళిత కుటుంబాలకు 120 గజాల చొప్పున పంచాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాను ఆమరణ దీక్ష చేస్తానని శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## కెసిఆర్‌పై విశ్వాసంతోనే బిఆర్ఎస్‌లో చేరికలు : మంత్రి సబితారెడ్డి

**సరూర్‌నగర్, జూలై 30 ప్రభాతవార్త:** కెసిఆర్ వల్లే రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నదనీ.. ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయనే విశ్వాసంతోనే నేడు చాలా మంది ఇతర పార్టీల నుండి బిఆర్ఎస్‌లోకి వచ్చి చేరుతున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని కుర్మల్‌గూడకు చెందిన తెలంగాణ రాష్ట్ర బిజెవైఎం లీగల్ సెల్ కన్వీనర్, వనపర్తి జిల్లా ఇంఛార్జి టేకుల భాస్కర్ రెడ్డి ఆదివారం పెద్ద ఎత్తున తన అనుయాయులు, గ్రామస్తులతో కలిసి సబితారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కుర్మల్‌గూడలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పార్టీలో చేరిన టేకుల భాస్కర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ చిర్ర శ్రీధర్‌లతో పాటు పలువురికి సబితారెడ్డి కండువాలు వేసి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తర్వాత సాధించినఅభివృద్ధి, ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గమనిస్తున్న వారు కెసిఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ ను గెలిపించడానికి పార్టీలో చేరుతున్నారని అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం నుండి పార్టీలో చేరుతున్నవారికి స్వాగతం పలుకుతున్నట్లు ఆమె తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలనీ పార్టీపై వారు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతామని సబితారెడ్డి స్పష్టం చేశారు.

**సబితారెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం: భాస్కర్‌రెడ్డి**

మహేశ్వరం నియోజకవర్గంలో ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం మంత్రి సబితా ఇంద్రారెడ్డితోనే సాధ్యమవుతున్నదనే పూర్తి నమ్మకం, విశ్వాసంతోనే తాము బిఆర్ఎస్‌లోచేరినట్లు బిజెపిని వీడిన టేకుల భాస్కర్‌రెడ్డి వెల్లడించారు.



టేకుల భాస్కర్‌రెడ్డికి బిఆర్ఎస్ కండువా వేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

పార్టీలో చేరిక సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సబితారెడ్డిని గెలిపించుకొని మరోమారు మంత్రిగా చూస్తామన్నారు. కార్పొరేటర్ బొద్రమోని రోహిణిముదిరాజ్ సమన్వయంతో జరిగిన కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, భాగ్యనగర్ సొసైటీ ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, మాజీ ఎంపిటిసి పెద్దబావి ఆనంద్‌రెడ్డి, కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యుడు మర్రి జగన్మోహన్‌రెడ్డి, కళ్లెం చంద్రారెడ్డి, యెల్చల సుదర్శన్‌రెడ్డి, బొద్రమోని రమేష్, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పిసిసి ఛీఫ్ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బొంతు రామ్మోహన్ తదితరులు

**ఉప్పల్, జూలై 30 ప్రభాతవార్త :** సిఎం కెసిఆర్, మంత్రి కేటిఆర్‌లపై పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉప్పల్ చౌరస్తాలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, మేకల హనుమంతరెడ్డి, మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్ణ నాగేశ్వర్‌రావు, గొల్లూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గ్రూపు రాజకీయాలతో ఉప్పల్ ప్రాంతం రాజకీయ రణరంగంగా మారిందన్నారు. ప్రజలు వరదలతో ఇబ్బంది పడుతుంటే వారిని పరామర్శించడం మర్చిపోయి రేవంత్‌రెడ్డి రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి వచ్చినట్లు ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలు తమ రాజకీయాలతో పోలీసులు, మీడియా వ్యక్తులపై దాడులు చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన సిఎం కెసిఆర్‌ను విమర్శిస్తే కాంగ్రెస్ పార్టీని తరిమి కొడతామన్నారు. మల్కాజిగిరి ఎంపిగా గెలిచిన రేవంత్‌రెడ్డి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నేతలు, ఉప్పల్ నియోజకవర్గం నేతలు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ శ్రీలతకు కాలనీవాసుల వినతి



డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఖాజ

**తార్నాక, జూలై 30 ప్రభాతవార్త :** ఓ.యూ. క్యాంప్ నెం.6లో నెలకొన్న సమస్యలపై డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డికి బస్తీవాసులు వినతిపత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా బస్తీలో వీదిదీపాలు వెలగడంలేదని, డ్రైనేజీ సమస్య, రోడ్డు మరమ్మతులు చేయించాలని డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రంలో కోరారు. అందుకు డిప్యూటీ మేయర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఖాజా పాష, ఫయాఖ్, యాఖూబ్ షరీఫ్, పాష తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 66వ హోమ గుండాల కార్యక్రమం



పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, జూలై 30 ప్రభాతవార్త :** సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ శ్రీ రేణుక రాజేశ్వరి శక్తిపీఠం మొల్లూరి నవీన్ శర్మ ఆధ్వర్యంలో గృహ పీడల నిరువృత్తికై రుణ విమోచన గణపతి, నృసింహ సహిత శ్రీ లక్ష్మీ హావణమును సామూహిక 66వ హోమ గుండాల కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బి.యన్.రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, రాజేందర్‌రెడ్డి, ముత్యాలు, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఐఎస్ సదన్ డివిజన్‌లో ఘనంగా తీజ్ పండుగ వేడుకలు : జంగం శ్వేత



తీజ్ పండుగ సందర్భంగా ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి డివిజన్ పరిధిలోని నీలం రాజశేఖర్‌రెడ్డినగర్‌లోని జగదాంబ తల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.
(ప్రభాతవార్త, సైదాబాద్)

## పాలకుల వైఫల్యంతో అస్తవ్యస్థ డ్రైనేజీ వల్లే ప్రజలకు సమస్యలు : నవారు మల్లారెడ్డి

**సరూర్‌నగర్, జూలై 30 ప్రభాతవార్త:** అస్తవ్యస్తమైన డ్రైనేజీల వల్లే భారీ వర్షాల్లో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 24వ డివిజన్‌లోని ఎంఆర్ఆర్, జయశంకర్ కాలనీల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, డివిజన్ ఇంఛార్జి నవారు మల్లారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన వర్ష ప్రభావిత కాలనీల్లో పర్యటించి స్థానికుల సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్ఆర్ కాలనీ, జయశంకర్ కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పటిష్టంగా లేకపోవడం వల్ల ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు స్థానిక కోమటికుంట చెరువులో చేరిన మురికినీరు వెనక్కివచ్చి రెండు కాలనీల్లోని డ్రైనేజీ వ్యవస్థను ముంచెత్తిందని ఆయన పేర్కొన్నారు. దీంతో సుమారు 50 కుటుంబాల వారు ఇంట్లో ఉన్న టాయిలెట్లను వాడలేని దుస్థితి ఎదుర్కొంటున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. చెరువుల సుందరీకరణ పూర్తి చేయకపోవడం, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు సరైన లెవల్ వేయకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని అన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ట్రంక్‌లైన్ పనులు, చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేయించి పక్కాగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన కాంగ్రెస్ తరపున డిమాండ్ చేశారు.

## డ్రైనేజీ ట్రంక్‌లైన్ ఏర్పాటు చేయాలి: ఐక్యవేదిక



ప్రధాన రోడ్లపై నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

**వనస్థలిపురం, జూలై 30 ప్రభాతవార్త :** బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని 21 కాలనీల ప్రతినిధులు డ్రైనేజీ ట్రంక్ లైన్ సాధనకోసం పాపిరెడ్డికాలనీ సమీపంలోని ప్రధాన రోడ్డుపై ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్బంగా ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వానికి అన్ని రకాల పన్నులు కడుతున్నప్పటికీ మౌళిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. వర్షాకాలంలో వరద నీటితోపాటు లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయని, ట్రంక్‌లైన్ నిర్మాణం జరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కుంటున్నామన్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. నెలరోజుల వ్యవధిలో డ్రైనేజీ ట్రంక్‌లైన్, రోడ్ల నిర్మాణం, మంచినీటి సౌకర్యం కల్పించాలని లేనియెడల ఐక్యవేదిక ఆద్వర్యంలో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో 21 కాలనీల ప్రతినిధులతోపాటు చిత్తరంజన్, రవికుమార్, జక్కిడి సంజీవరెడ్డి, సరస్వతి, అశోక్‌రెడ్డి, అంజాద్‌అలీ, ఆంజనేయులు, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



సరూర్‌నగర్ డివిజన్ విజయపురి కాలనీలోని మూడు గుల్ల దేవాలయంలో జరిగిన బోనాల ఉత్సవాల కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఉపేందర్ రెడ్డిని సన్మానించారు.
(ఎల్.బి.నగర్, ప్రభాతవార్త)

## పైపుల సైజును పెంచి రోడ్డును పునరుద్ధరించాలి : సిద్దంకి కృష్ణారెడ్డి

**హయత్‌నగర్, జూలై 30 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 5వ వార్డు పరిధిలోని చాకలివాగు కల్వర్టు పనులలో భాగంగా మట్టిరోడ్డును వెంటనే పునరుద్ధరించి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని బీఆర్ఎస్ మున్సిపాలిటీ కమిటీ అధ్యక్షుడు సిద్దంకి కృష్ణారెడ్డి అధికారులను కోరారు. శనివారం ఆయన కల్వర్టు వద్ద ఇటీవలి వరదలకు కొట్టుకుపోయిన రోడ్డు, పైప్ లైన్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో వచ్చిన వరద కారణంగా కల్వర్టు నిర్మాణ పనుల్లో భాగంగా వేసిన రోడ్డు కొట్టుకుపోయిందన్నారు. దీంతో పెద్దఅంబర్‌పేటనుంచి కోహెడవైపు వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయినట్లు వివరించారు. కల్వర్టు పనులను వేగంగా పూర్తి చేయాలని అప్పటివరకు పైపుల పరిమాణాన్ని పెంచి రోడ్డును పునరుద్దరించాలని కోరారు. దీనిపై ఆర్అండ్‌బీ డీఈఈ స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చెరుకూరి జగన్, పాలడుగు నాగార్జున ఉన్నారు.

## జాతీయ కార్యవర్గంలో బండికి చోటు హర్షణీయం : చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూలై 30 ప్రభాతవార్త :** తెలంగాణలో కెసిఆర్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి బిఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా బిజెపిని నిలిపిన బండి సంజయ్‌కుమార్‌కు దక్షిణాది రాష్ట్రాల నుండి పార్టీ జాతీయ కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా నియమించడాన్ని స్వాగతిస్తున్నామని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఇటీవల వరకు పార్టీ అధ్యక్షునిగా పని చేసిన బండికి జాతీయ కార్యవర్గంలో పార్టీ అధిష్టానవర్గం చోటు కల్పించడం హర్షణీయమన్నారు. ఈ మేరకు పార్టీ శ్రేణులన్నీ సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయని ఆయన వెల్లడించారు. పార్టీ పగ్గాలు చేపట్టిన కొద్ది కాలంలోనే అవిశ్రాంతంగా పని చేసి ప్రజా సంగ్రామ యాత్రల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చిన బండి సంజయ్‌కు సముచిత స్థానం ఇచ్చారని ఆయన అన్నారు.